

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఇంటికి వెళ్ళి ప్రొఫెసర్** ఇచ్చిన ప్రింట్ అవుట్లు చదువుదామని కూర్చున్నాను. బహుశ టెన్షన్ పోయిందేమో, ఆకలి తెలిసింది. వెంటనే ఓ రెండు దోసెలు వేసుకుని, హనీషకి కూడా ఓ రెండు వేసి ఇచ్చాను.

"తినేంతసేపు ఏమైనా చూద్దామా?"

"యా. ఓకే"

"ఒక మంచి సినిమా చెప్పు నువ్వే"

"వీడెవండండి బాబు?"

"బాబు ఆ? నేను పాప" ఆశ్చర్యపోయింది.

"అది సినిమా పేరు"

"ఓ. అలాగా" పెద్దగా నవ్వింది.

"హీరో ఎవరు?" యూ ట్యూబ్ తెరుస్తూ అడిగింది హనీష.

"మోహన్‌బాబు, శిల్పాశెట్టి" బదులిచ్చాను.

"మోహన్‌బాబుతో శిల్పాశెట్టి చేసిందా?"

"అదొక్కటే సినిమా అనుకుంటా."

ఇద్దరం కలిసి సినిమా చూస్తూ భోంచేసాము. ప్లేటు కడిగిన తరవాత, "సాయంత్రం అంతా ఉంది కదా, ఇంకొద్దిసేపు చూడు సినిమాని. ఆ తరవాత నేను జింకి వెళ్తాను" హనీష అంది.

"సరే. ఇంకో హాఫ్ అవర్ చూద్దామా?" అడిగాను.

"యా. క్లైమాక్స్ రాత్రి తినేప్పుడు చూద్దాం" ఒప్పందానికి వచ్చాం.

"ఈ సీన్ జాగ్రత్తగా విను ఫోన్ పక్కన పెట్టి" విసుక్కున్నాను కూడా. అది నా ఫేవరెట్ సీన్. అందులో కోట శ్రీనివాస్‌రావుని కిడ్నాప్ చేసిన వాళ్ళు ఫోన్ చేసి నాలుగుకోట్లు అడుగుతారు. బేరం ఆడగా ఆడగా ఒక్కో సున్నానీ తగ్గించి నాలుగు కోట్ల నలభై లక్షలు నలభై వేలై, నలభై వేలు నాలుగువేలు, చివరికి నాలుగువందలు దాకా దిగజారుతుంది. అది చూసి మేము తెగనవ్వుకున్నాము. ఆ తరవాత కొద్దిసేపు కళ్ళు మూసుకున్నాను అంతే తిరిగి లేచేసరికి ఇల్లంతా చీకటి గుయ్యారం. ఎక్కడ ఉన్నానో ఓక రెండు నిమిషాల వరకు అంతు పట్టలేదు.

ఆ తరవాత ఎప్పుడు పడుకున్నానా అని ఓ రెండు నిమిషాలు ఆలోచించాను. సినిమా సగంలో అని అర్ధమైంది. టైం చూస్తే ఎనిమిది. హనీష, వెన్నెల, ఇద్దరూ ఇంట్లో లేరు. హనీష జింలో, వెన్నెల ఆఫీసులో ఉండి ఉంటారనుకున్నాను. అయినా హనీష నన్ను లేపాల్సింది. నేను చదువు కోవాలని తెలిసికూడా లేపలేదని చాలా కోపం కలిగింది. అన్నయ్య మిస్డ్‌కాల్ ఉండడంతో వెంటనే కాల్ చేసాను.

"ఎలా అయ్యింది ఇంటర్వ్యూ?"

"తెలీదు"

"తెలీదంటే?"

"రేపు మళ్ళీ రమ్మన్నారు. ఇంకొన్ని పేపర్స్ చదవమని ఇచ్చారు."

"ఓ. అయితే బానే అయ్యింది కదా"

"కానీ జాబ్ ఇంకా రాలేదు."

"వస్తుందిలే. పేషెన్స్ ఈజ్ పర్యూ"

"నేను ఇంటి కొచ్చాక రోజంతా నిద్రపోయాను. ఇంకా చదవలేదు."

"ఎంతవుంది?"

ఇంటికి తెచ్చిన పేపర్లు చూసి "నాలుగు జర్నల్ ఆర్టికల్స్" బదులిచ్చాను.

"ఫర్లేదులే ఇంకా టైం ఉందిగా. రేపు ఎప్పుడు రమ్మన్నారు?"

"సేం టైముకి"

"అయితే పొద్దున కూడా టైం ఉందిగా టెన్షన్ పడకు. అయినా నీకు అంతా అర్ధం కాదని ఆయనకి తెలుసు. ఇప్పుడే చేరావు కదా నీ గ్రాస్పింగ్ పవర్ ఎలా ఉందో చూద్దామని అడిగుంటారు నీకు రాకపోతే రాదు అని చెప్పెయ్యి. ఇక్కడ అబద్ధాలు సహించరు. వీసా ఇంటర్వ్యూలాగా ప్రశ్నకి సమాధానం కాకుండా కాస్త అటూ ఇటూగా కూడా మాట్లాడచ్చు. కాన్ఫిడెంట్‌గా ఉండు. ఏమైనా తెలియంది అడిగితే 'ఐం అఫ్రైయిడ్ ఐ డోంట్ నో ది ఆన్సర్, ఐం విల్లింగ్ టూ లర్న్ ' అను. బ్లంట్‌గా ఐ డోంట్‌నో అని వదిలేయకు."

"సరే."

"టైం డివైడ్ చేసుకో. అన్ని ఆర్టికల్స్‌కి ఆబ్‌స్ట్రాక్ట్ చదువు. ముందు ఏది సులువుగా అనిపిస్తే దాంతో మొదలు పెట్టు. అర్థంకాని వాటి మీద ఎక్కువ టైం వేస్ట్ చెయ్యకు. టెన్ మినిట్స్ మేక్స్. నీకు జాబ్ ఇచ్చినా ఇవ్వకపోయినా నీ ప్రొఫెసర్‌ని అడిగి క్లేరిఫై చేసుకో. ఇవాళ్ళ రాత్రి రెండు, రేపు రెండులాగా ఒక టార్గెట్ పెట్టుకో. సీనియర్స్ హెల్ప్ చేస్తారేమో కనుక్కో. కానీ రాత్రిపూట అబ్బాయిలని ఎక్కువ ఎంటర్‌టెయిన్ చెయ్యకు. పేరెంట్స్ దూరంగా వుండి ఫ్రీడం వచ్చ్చేసరికి విచ్చలవిడిగా ఉంటారు. ఎంత డీసెంట్ అయినా బౌండరీస్ దాటనివ్వకు. తొమ్మిది దాటాక ఎవ్వరినీ ఇంట్లో ఉండనివ్వకు. నువ్వు కూడా బయటకి వెళ్ళకు. సరేనా?"

"సరే."

"తిన్నావా?"

"యా మధ్యాహ్నం దోసలేసుకున్నాను"

"గుడ్. హెల్త్ ఇంపార్టెంట్."

"సరే."

"ఇంకేమన్నా ఉందా మాట్లాడ్డానికి?"

"లేదు. థాంక్స్ అన్నయ్యా. నువ్వు ధైర్యం చెపితే ఎంతో బావుంది"

"ఎనీ టైం. ఐ జస్ట్ ఎ ఫోన్ కాల్ అవే. బై"

"గుడ్‌నైట్"

అన్నయ్యతో మాట్లాడాక ధైర్యం పెరగడంతోపాటు హనీష మీద కోపం కూడా తగ్గింది. ఇప్పటివరకు కలిగిన బెంగకూడా పోయింది. ఇంతలో తలుపు చప్పుడయ్యింది. వెన్నెల వచ్చిందా? హనీష వచ్చిందా? అని ఒక నిమిషం ఆలోచించేలోపే ఇద్దరి గొంతు వినిపించింది.

"లేస్తుందేమో మెల్లిగా" అని వెన్నెల.

"లేచే ఉంటుంది. ఎప్పుడో మధ్యాహ్నం పడుకుంది" అని హనీష అనుకుంటుండగా

"లేచేసాను" అంటూ వాళ్ళ దగ్గరకి వెల్యాను.

"ఎప్పుడు లేచావు?" అని హనీష

"లైట్ ఆన్ చేసుకోలేదేంటి?" అని వెన్నెల అడిగారు.

ఇద్దరి ప్రశ్నలకి సమాధానంగా "ఇందాకే లేచాను. జస్ట్ టెన్ మినిట్స్ అవుతుంది" బదులిచ్చాను.

"నువ్వు రాత్రి సరిగా పడుకోలేదు కదా, అందుకే లేపలేదు" హనీష అంది.

"ఫరవాలేదులే. రాత్రి కొంచెం, పొద్దున కొంచెం చూసుకుంటా. సరిపోతుంది" అన్నాను.

"కంగ్రాచులేషన్స్ ఇంటర్వ్యూ బాగా య్యిందంటకదా" వెన్నెల అంది.

"లేదు. రేపు మళ్ళీ ఉంది."

"ఆయన హయర్ చేసుకుంటారు కాబట్టే మళ్ళీ రమ్మని ఉంటారు. ఎట్‌లీస్ట్ రిజెక్ట్ అయితే చెయ్యలేదుగా"

"ఔను. కరెక్టే"

"మేము గ్రోసరీలు కొనడానికి వెళ్ళాము. నిన్ను లేపడానికి ట్రై చేస్తే కదల్లేదు. అందుకే వెళ్ళిపోయాము"

"పర్లేదులే. నిద్రసరిపోయింది"

"రాత్రికి ఏం చెయ్యను?" వెన్నెల అడిగింది.

"నీ ఇష్టం" నేను, హనీష అన్నాం.

"గోంగూర ఉత్త పప్పు?"

"యా...యా" అన్నాను.

ఇద్దరూ నవ్వారు.

వెన్నెల వంట చేసేంతసేపు ముగ్గురం కబుర్లు చెప్పుకున్నాము.

హనీష వీడెవడండి బాబు స్టోరీ అంతా చెప్పింది. కోట శ్రీనివాసరావు కిడ్నాప్ బేరం దగ్గరనుండి మొత్తం సినిమా ముగ్గురం కలిసి చూస్తూ భోంచేసాము. ఆ తరవాత నేను జర్నల్ ఆర్టికల్స్ తెరిచి చదవసాగాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story